కథానిక:

# సైకిలు సవారీ

రచన: **శ్రీ సుదర్శన్**

అనువాదము: **శ్రీ ఆదిభట్ల వేంకటరమణ**

ఎవరు సైకిలు త్రొక్కినా "హార్మోనియం" వాయించినా నె నెంత సిగ్గుపడతానో దేవుడికే తెలుసు. భగవంతుని విచిత్రసృష్టిలో ఈ రెండు విద్యలు ప్రత్యేకస్థానం ఆక్రమించేయి ఒకసమయం కులాసాగా గడిచిపోతుంది. ఇంకొకసమయం తరిగిపోతుంది. కాని, ఈ చిత్రం చూడండి. మా ప్రారబ్ధమువలన కలియుగంలో ఈ రెండు విద్యలు మానుగుటను వ్రాసి లేవు. సైకిలు త్రొక్కలేను, "హార్మోనియం" వాయించలేను.

బహుశః 1932 వ సంవత్సరం మాట. ఒక మామి కూర్చొని ఉండగా "సైకిలు నేర్చుకొందామా" అన్న ఆలోచన కలిగింది. నాకు తెలియకుండా మా అబ్బాయి సైకిలు త్రొక్కడం నేర్చుకొని, నా ఎదుటనుండే త్రొక్కుతూ నన్ను ఊరిస్తున్నాడు. అప్పుడేం చెప్పమన్నారు. సిగ్గు, అసహ్యము, అన్నీ ఒక్కమాటే కలుగుతాయి. ఈ విశాలప్రపంచములో నే నొక్కడనే వెనకకి ఉండిపోయేను గాబోలు. ప్రపంచమంతా ముందికి పోతున్నాది. చిన్న చిన్న పిల్లలు సైకిలుమీద "రంయ్" మని పరిగెడుతున్నారు. పల్లెటూరివాళ్లు కూడా దానిమీద స్వారీసాగిస్తున్నారు. మేము దేవుడివలన బాగా చదువుకొన్నాం. కాని, సయికిలు స్వారి మాత్రం రాదు. ఇందులో అంత కష్టం మిటి ఉంది. బ్రహ్మవిద్యా ఏమిటి? సైకిలు మీద కూర్చొని నడివీథిలో త్రొక్కుతే ఎంత బాగుంటుందో? రోడ్డుమీద నడుస్తూ ఉంటే ప్రతీవాడూ "టిక్-టిక్" మని ఘంట వాయిస్తూ "రంయ్" అని త్రొక్కుతాడు. వాడిని చూసి మనమే తప్పకోవాలి. లేకపోతే మనప్రక్క క్రోధపూర్ణ లోచనాలతో చూస్తూ సయికిలు త్రొక్కుతాడు. ఇదంతా ఇనపగుఱ్ఱం (సైకిలు) యొక్క రహస్యమే. బాగుంది—బాబూ! ఇంక సైకిలు నేర్చుకొందికి సిద్ధమయేను.

ఇంటిలో ఎవరికి తెలియకుండా సైకిలు నేర్చుకోవాలి. ఇంక మనం కూడా ఇనపగుఱ్ఱానికి అశ్వికులు (Riders) గా తయారుకావాలి. నా మనస్సులో ఆలోచనలు పరిగెత్తేయి. మేము సైకిలుస్వారిలో పండితులమైన వెంటనే జహంగీరు సమాధికి వెళ్లడానికి నిశ్చయం చేసుకొన్నాము. మా ఆడవాళ్లని తాంగాలో కూర్చోపెట్టి, మీరు వెళుతూ ఉండండి, మేము మరొక తాంగాలో వస్తాం అని చెప్పి, నేను సైకిలు మీద జోరుగా వెళ్లి వాళ్లని త్రోవలో కలుస్తాను. అప్పుడు మా ఆడవాళ్లు మమ్మల్ని చూసి గురిసిపోరూ? తప్పకుండా విస్మయులౌతారు. "డంగ్" అయిపోతారు. కళ్లు మిటకరించి చూస్తారు. కాని నేను పెడముఖంతో తాంగాతో సమానంగా సయికిలు త్రొక్కుతాను. అప్పుడు వాళ్లేమి టనుకొంటారు. ఇతను సయికిలు సవారి ఎప్పుడు నేర్చుకొన్నాడా? అనుకొంటారు. ఏమంత కష్టమైన మాట? మాకు ఒక చిన్న విషయమే.

మంచిది. దెబ్బ తగులుతే చికిత్సచేయడానికి రెండు "జాంబక్" డబ్బాలు కొన్నాను. తరువాత మంచిమైదానం వెతికి మరునాటి నుండీ నేర్చుకొందికి సిద్ధమయేను.

2

అయితే సైకిలు చేర్చుకోవడ మెలాగ? ఒక మాష్టరుని నియమించాలి. మొదట మాష్టరు లేకుండా నేర్చుకోవా లనిపించింది. మా పిల్లవాడు సైకిలు నేర్చుకొందికి ఎవరి శిష్యత్వము చేసేడు? నా అంతట నేనే నేర్చుకొన్నా నని ఒక మాటు చెప్పినట్లు జ్ఞాపకం. ఒక మాటు పడతాము. రెండు మాట్లు పడతాము. తప్పితే మూడుమాట్లు పడతాము. అస్తమానమూ పడము కదా? తిరిగి ఆలోచించేము. వాడు పిల్లవాడు కాబట్టి పడినా బాగుంది. నేను చిన్నవాడిని కాదు. పడితే బాగుంటుందా? మనుష్యుడేదైనా నేర్చుకొంటే జాగ్రతగా నేర్చుకోవాలి. లేకపోతే నష్టం తప్పదు. అందు కొక మాష్టరుని నియమించడానికి నిశ్చయించుకొన్నాను. ఈ ఆలోచనలో ఉండగా తివారీ లక్ష్మీనారాయణగారు వచ్చేరు. ఇలాగ అన్నారు:" "మిత్రమా! ఏమి తోచలేదు. ఒకమాటు చదరంగం తెమ్మని మీవాడికి కేకపెట్టు."

నేను—(తలఊపి) ఒద్దయ్యా, నాకేమీ తోచలేదు.

తివారీ: (తనబట్టతలమీద టోపీ తీసి, తల రాసుకొంటూ) నే నెంతో దూరంనుండి చదరంగ మాడడానికి వచ్చేను. ఇష్టం లేదంటావేమి?

నేను: ఇష్టం లేకపోతే ఏమి చేయమంటారు? నే నీవిధంగా అనీసరికి తివారీజీ మనస్సు ఎందుకో బాధపడింది. నాదగ్గరగా వచ్చి, ఇలాగన్నారు:

తివా: తమ్ముడూ! అంత ఉదాసీనంగా ఉన్నావేమి?

నేను: తివారీభయ్యా! ఏమి చెప్పేది? సైకిలు నేర్చుకోవాలని మనసులో ఉద్దేశం కలిగింది. కాని, మాకు సహాయముచేసే వ్యక్తి ఎవరూ కనిపించలేదు. మీ దృష్టిలో ఎవడేనా ఉంటే చెప్పరూ?

తివా ఉన్నాడుగాని, ఉచితంగా నేర్పడు. చార్జీ తీసుకొంటాడు, ఇవ్వగలవా?

నేను: ఎన్నిరోజులలో నేర్పగలడు?

తివా: పది లేక పదిరెండురోజులలో.......

నేను: చార్జీ ఎంత తీసుకొంటాడు?

తివా: పయివాళ్లైతే పాతిక. మన మాటమీద గౌరవం ఉంది కాబట్టి 20 రూపాయిల కొప్పుకొంటాడని నా నమ్మకం.

నేను: (మనస్సులో) పది రోజులలో నేర్పుతాడా? 20 రూపాయిలు తీసికొంటాడా? పది రోజులు...ఇరవై రూపాయిలు. 20 రూపాయిలు......పది రోజులు. అంటే, రోజుకి రెండు రూపాయిలా? అదేనా ఒకగంటో, రెండుగంటలో.. ఈలాంటి రెండు మూడు "ట్యూషన్స్" వచ్చేయంటే 350 రూపాయిలు నెలకి సంపాదన. తరువాత తివారీజీతో మాష్టరుగారిని తీసుకొనిరమ్మని చెప్పేను. నాకెంతో సంతోషంగా ఉంది. ఎందుకంటే, సైకిలు త్రొక్కడం వస్తే ఒక "ట్రైనింగ్ స్కూలు" పెడతాను; మూడువందలో నాలుగు వందలో నెలకి సంపాదిస్తాను. కొంచెంసేపటిలో తివారీజీ బయటనుండి పిలచేడు. నేను వెళ్లి చూసేను. మాష్టరుగారు నిలబడి ఉన్నారు. నల్లటిరూపు, మోటుశరీరము, మెడలో నల్లని "నెక్టై" మాసిన లుంగీ. కాళ్లకి కాశ్మీర్ "చెప్పులు. ఈ రూపు చూసి ఈ మాష్టరుగారు నాకు వద్దని చెప్పేదా మనుకొన్నాను. కాని, మళ్లా ఆలోచించేను. మనం సైకిలు నేర్చుకొందికి ఈతని రూప మెందుకు అనుకొని, ఒక మంచి విద్యార్థివలె చేతులు కట్టుకొని నమస్కరించేను.

తివారీ: ఈయన 20 రూపాయల కొప్పుకొనలేదు. కాని ఏలాగో ఒప్పించేను. ఈయన 'advance తీసుకొంటూ'రట. వెనక నెవరిస్తారు అని అంటున్నారు.

నేను: ఓయ్ తమ్ముడూ, మే మిచ్చేస్తాము. ప్రపంచమంతా చెడ్డదే కాని, సాధుజనులు మంచివారు. ప్రపంచాన్ని ఖాళీచేసేలేదు. 20 రూపాయలకి పారిపోతామా? ఒకమారు నాకు సైకిలు నేర్పండి, తరువాత నే నిచ్చేది చూడండి.

మాష్టరు: ఏమైనా మొదటే కొంత డబ్బు తీసుకొంటామండీ.

నేను: "ఫీజు" తీసికొని నేర్పకపోతే?—

మాష్ట: నేర్పకపోతే "ఫీజు" తిరిగి ఇచ్చేస్తాము.

నేను: ఇవ్వకపోతే?—

మా: ఈ "లేకపోతే" అన్నమాటకి నాదగ్గర జబాబు లేదు. కాని, నమ్మకం లేకపోతే కష్టం.

తివా: "ఫీజు" తీసికొని పారిపోతే ఈ తివారీ ఏమయ్యేడు. పట్టణంలో తిరగడమే కష్టము. "ఫీజు" తీసికొని పారిపోవడమన్నమాట వింటే ఎవరేనా నవ్విపోతారు.

. తివారీజీ మాటలమీద మాకు నమ్మకం కలిగింది. మాష్టరుగారు దగా చేయరు అని డబ్బు తెచ్చి మాష్టరుగారికిచ్చి "మాష్టరుగారూ, రేపు ఉదయమే దయచేయండి. నేను సిద్ధంగా ఉంటాను. నేనీపనికోసం బట్టలుకూడా కుట్టించుకొన్నాను. ఒకవేళ పడిపోతే "జాంబక్" డబ్బాలు కూడా సిద్ధం చేసుకొన్నాను. మా యింటి ప్రక్కనున్న మిస్త్రీసాహెబుగారిదగ్గర సైకిలు తీసికొంటాను. రేపుదయమే దేవుడి పేరు చెప్పి ఆరంభము చేదాము.

తివారీజీ, మాష్టరుగారు వెళ్లిపోయేరు, ఇంతలో ఒకమాట చెప్పడం మరచిపోయేను. జోళ్లు లేకుండా పరిగెత్తుకొని వెళ్లి వాళ్లని నడి బజారులో కలుసుకొన్నాను. వారు ఆశ్చర్యపోయేరు ఆయాసంతో ఇలాగ అన్నాను. "మాష్టరుగారూ. మేము...ఊళ్లో నేర్చుకోము... లారెన్సుబాగ్ లో నేర్చుకొంటాము. అక్కడ చోటు...విశాలంగా ఉంది—పెద్ద దెబ్బలు తగలవు. ఇంకెవరూ అక్కడ చూడరు.

3

ఆరోజు రాత్రి నిద్ర ఎక్కడ? అస్తమానం పలవరిస్తున్నాను. ఇంకా సూర్యుడుదయించలేదేమా అని ఆలోచించాను. నిద్దర కొంచెం వస్తే సయికిలు త్రొక్కినట్లు కలలు వస్తున్నాయి. ఒకమారు నేను సైకిలునుండి పడిపోయినట్లు, ఆసుపత్రిలో దొరలు శస్త్రచికిత్స (Aperation) చేస్తున్నట్లు కలలో చూసేను. రెండో మారు భూమిపైన నిలిచి ఉండినట్లు, సైకి లాకాశం మీద తిరుగుతున్నట్లు కల వచ్చింది. ఒకమారు మాష్టరుగారు తన చేతులోకి న స్నాత్తి మీదకు విసరివేసేరు. మరుక్షణంలో నేను సైకిలుమీద స్వారీచేస్తున్నాము. సైకిలు తనంతట తానే గాలిలో ఎగురుతున్నాది. జనులంతా నా ప్రక్క కండ్లు మిటకరించి చూస్తున్నారు. ఒక దేవత నా భుజముపై చేయివేసింది. నేను భూమిమీద దభీమని పడినట్లైంది. అప్పుడు తెలివివచ్చింది లేచి చూస్తే ఇదంతా కల. నేను మంచముమీదే ఉన్నాను.

లేచి చూసేను. సూర్యుడుదయించేడు. వేగం లేచి, బంట్రోతుని పంపి, మిస్త్రీసాహబు గారింట సైకిలు తెప్పించాను. ఆ సమయంలోనే మాష్టరుగారు కూడా ప్రవేశించేరు. జాంబక్ డబ్బా. చేతులో పట్టుకొన్నాను. దేవుడిపేరు చెప్పి "లారెన్సుబాగ్" ప్రక్క బయలుదేరేము. అప్పుడే గుమ్మం దిగేమోలేదో పిల్లి త్రోవకడ్డంగా ప్రవేశించింది. ఒక కుఱ్ఱవాడు తుమ్మేడు. ఏమి చెప్పం—ఆ సమయంలో ఎలాటి కోపం వచ్చిందంటే చెప్పతరంకాదు. కాని, పళ్లు పటపట కొరికి ఆగిపోయేము. మరొకమారు భగవంతుని పావననామము స్మరించి, ముందుకి నడచేము. తరువాత బజారులోకి వెళ్లగా కొందరు నా ప్రక్క చూసి నవ్వుకొంటున్నారు. నే నాశ్చర్యపోయేను. అసలు సంగతేమిటి? సైకిలు తొందరలో ఘాబరాపడి, పైజమాను లాల్చీని తిరగవేసి తొడుక్కొన్నాను. అందుకే జనమంతా నవ్వుతున్నారు. తల వంచుకొని ఊరకొన్నాను.

మాష్టరుగారిని క్షమాపణ కోరుకొని ఇంటికి తిరిగిపోయేను. అంటే ఆరోజంతా వ్యర్థంగా గడచిపోయింది.

రెండోరోజు ఉదయ మయింది. మా యింటి ప్రక్కనున్న లాలాసాహబుగారు ఎదురుగా వచ్చి, చిరునవ్వుతో "ఎక్కడికి బయలుదేరారు?" అని అడిగేరు. ఈ లాలా సాహబుగారు చాలా మంచివారే; కాని, ఎవరైనా వీథిలోనికి బయలుదేరితే "ఎక్కడికి వెళుతున్నా?"రని అడిగే దురలవాటది. వీథిలోని కెవరైనా బయలుదేరుతే వారి నెక్కడకి వెళుతున్నారని అడిగితే, ఒకవేళ వాడిపని పాడైపోతే "ఎక్కడికి వెళుతున్నా"వని అడిగేవారిని తిడతారు. కాని, లాలాసాహబుకీ తిట్లు వినిపించవు. ఈ సమయంలో తప్పించుకొంది కెంత ప్రయత్నము చేసినా, ఎక్కడికి అనే ఫిరంగిగుండు ఆగదు. లాలాసాహబు మహాశయుడే స్వయముగా ముందికి వచ్చి కాలుస్తాడు. నాకు ఒళ్లు మండిపోయింది. "నరకానికి పోతున్నా" నన్నాను.

లాలా: (మళ్లా) మీ రెక్కడికి వెళుతున్నారని అడుగుతున్నాను.

నేను: నరకానికి పోతున్నామని మనవి చేసుకొంటున్నాను. ఈవిధంగా తమరు అడగకపోతే మీ కేమైనా నష్టం కలుగుతుం దేమిటి?

లాలా: మీ రెక్కడికి వెళుతున్నారో ఆ భగవంతుడికే తెలియాలి.

నేను: నేను రోడ్లమీద వ్యర్థంగా తిరుగుతున్నామని తలుస్తున్నారా?

లాలా ఎన్నో పర్యాయములు తమకి మనవి చేసుకొన్నాను. నాకు మీ "ఎక్కడికి" అనే పదంవలన భయం కలుగుతున్నాది. ఈ "ఎక్కడికి" అనే రోగ మెలాటిదో కాని మనిషిని ఒదలకుండా ఉంది. సైకిలు నేర్చుకొందికి వెళుతున్నాను. ఈ మాసిన బట్టలు చూడండి. ఇదుగో "జాంబక్" డబ్బా. ఇదుగో మాష్టరుగారు సైకిలుపట్టుకొన్నారు. కాని, మీ "ఎక్కడికి" ఈరోజును కూడా వ్యర్థము చేసింది. చిన్న చిరునవ్వుతో ఇలాగ అన్నాను: ఎక్కడికి? మీ "ఎక్కడికి" మాకు రెండు రూపాయిలు కర్చుచేసింది.


ఇక్కడ ఇలాగ ఉండగా మేష్టరుగారు గంట వాయించి మమ్మల్ని పిలచేరు. ఇలాగ అన్నారు "నేనొక గ్లాసు "లస్సీ" త్రాగివస్తాను. తమరు కొంచెం సైకిలు పట్టుకొండి.

లాలాసాహబు ఇదే సమయమనుకొని పరిగెత్తాడు. లేకపోతే ఇవాళను ండీ ఎవ్వరినీ "ఎక్కడికి వెళుతున్నా"రని అడగనని కాగితం రాయించుకొని ఉందును.

4

మాష్టరుగారు "లస్సీ" త్రాగుతున్నారు. అప్పుడు నేను చక్రముల ప్రక్క చూస్తూ పరీక్షచేస్తున్నాను. దాని హేండిలు పట్టుకొని కొంచం నడిపించడ మారంభించేను. కాని, రెండడుగులు వెళ్లేమో లేదో సైకిలు నామీద పడిపోతుం దేమో అనిపించింది. ఇదంతా మాలాలాసాహబుగారి "ఎక్కడికి" ప్రభావమే. లేకపోతే ప్రాణంలేని ఈ సైకిలుకూడా మావంటి పురుషసింహములపై అధికారం చేయడమా? ఈ సమయంలో నే నేమిటి చేయాలి. అని ఒక పెద్ద సమస్య. ఈయుద్ధక్షేత్రంలో నిలిచి ధైర్యముగా కార్యము సాధించడమా లేక, మానుకోవడ

(18-వ పేజీ చూడుడు)



# ఇండోచీనా జాతీయసమరం

(10-వ పేజీ తరువాయి)

కులు నగరాన్ని ముట్టడించగానే ఫ్రెంచి సైనికులు నగరం విడిచి పారిపోయారు. తరువాత ఫ్రెంచి సైన్యాలు అదనంగా నగరానికి పంపబడినాయి. ఉభయపక్షాల్లో దేనికీ విజయం లభించలేదు. కాని దేశమంతటా పలు ప్రదేశాల్లో యుద్ధం రగిలింది. 1947 - 48 సంవత్సరాల్లో ఫ్రెంచిసైన్యాలు అనాం, టాంకింగ్ రాష్ట్రాలలో చిన్నచిన్న భాగాలను ఆక్రమించుకున్నాయి. కాని ఫ్రెంచి సైన్యాలకు అపారంగా ప్రాణనష్టం సంభవించ నారంభించింది. వియత్ మిన్ గొరిల్లాదళాల తాకిడికి కూడా ఫ్రెంచి సైన్యాలు నిలువలేకున్నాయి. మాసానికి నాలుగు మిలియనుల ఫ్రాంకులు ధారపోసి, వేలాది సైనికుల ప్రాణాలు బలిచ్చినా వియత్ మిన్ గొరిల్లాలను ఫ్రెంచిసైన్యాలు జయించలేకపోయినాయి. ఆ తరువాత ఇంత కాలమైనా ఫ్రెంచిసైన్యం అంగుళం మేర ఆక్రమించలేకపోయింది. కాని గొరిల్లాలవాతబడి రోజూ వందలాది సైనికులు హతులౌతున్నారు.

## మిత్రభేదం:

1946 మార్చిలో ఒక వైపున హోచిమిన్‌తో సంప్రదింపులు జరుపుతూ మరొక వైపున హాంకాంగ్‌లో నివాసమేర్పరుచుకున్న పూర్వ చక్రవర్తి బావోడాయ్‌తో, రహస్యంగా మంతనాలు ఆరంభించారు. ఇండోచీనాను విభజించి, వియత్‌నమ్ రిపబ్లిక్‌తో కొచిన్ చీనాకు విరోధం ద్వేషం పురికొల్పాలని ఫ్రెంచివారి యత్నం. ఫ్రాన్సులో ఫ్రెంచి సంరక్షణలో ఫ్రెంచి నాగరికతలో పెరిగిన బావోడాయ్‌ని అనాందేశీయుడనడం కంటె ఫ్రెంచిదేశీయుడనడం ఉచితం. తమ ఆక్రమణలో ఉన్న కొచిన్ చీనాను కట్టబెట్టగలమని చెప్పి, తాత్కాలికంగా హాంకాంగ్‌లో జనరల్ జువన్ నాయకత్వం క్రింద ఫ్రెంచివారొక ప్రభుత్వాన్ని సృష్టించారు. ఈ ప్రభుత్వంలో బావోడాయ్ ఉండడానికి అంగీకరించాడు. హోచిమిన్ ప్రభుత్వం హాంకాంగ్‌లో తలదాచుకున్న జనరల్ జువన్‌కు మరణదండన విధించింది.

అనేక మాసాలు ఫ్రెంచి సైన్యాలు యుద్ధం జరపవలసి వచ్చింది. చివరికి 1948 మార్చిలో కాలూనుకోడానికి కొచిన్ చీనాలో చోటు దొరికింది. జనరల్ జువన్ ప్రభుత్వం మే తేదీని స్థాపించబడింది. కొచిన్ చీనాలో "దక్షిణ వియత్‌నమ్ తాత్కాలిక కేంద్రప్రభుత్వం" అనే పేరు పెట్టారు. కొచ్చిన్ చీనాకు చెందినవారు 9 మందినీ, ఉత్తరోత్తరా అనాం టాంకింగ్ రాష్ట్రాలలో ఆక్రమించుకున్న ప్రాంతాలకు చెందినవారు 13 మందినీ చేర్చి మంత్రివర్గం నిర్మించారు. జూన్ 5 వ తేదీ జనరల్ జువన్ ఫ్రెంచి హైకమీషనర్ ఎమిరీబోలర్ట్‌తో ఒక ఒడంబడిక చేసుకున్నాడు. దక్షిణ వియత్‌నం "స్వతంత్రరాజ్యం"గా ఉండడానికి ఫ్రెంచి ప్రభుత్వం అగీకరించినట్లు, ఫ్రెంచి యూనియన్‌లోనే ఉండిపోడానికి దక్షిణ వియత్‌నమ్ అంగీకరించినట్లు ఈ ఒడంబడికలో వ్రాయబడింది. బావోడాయ్ ఈ ప్రభుత్వంలోకి రాలేదు. అప్పటికే బావోడాయ్‌ని తిరిగి చక్రవర్తిని చెయ్యాలనే సంకల్పం ఫ్రెంచివారికి కలిగింది.

కాని కొచిన్ చీనాలో గొరిల్లా చర్యలు జనరల్ జువన్ పేరుతో దేశం పరిపాలిస్తున్న ఫ్రెంచి పాలకులకు ముప్పుతెస్తున్నాయి. రెండు సంవత్సరాల ఇండొచీనా స్వాతంత్ర్య సమరంలో 71,300 మంది ఫ్రెంచిసైనికులు మరణించారు.

## అమెరికాతంత్రం:

బావోదాయ్ హాంకాంగ్‌లో ఉండగా అమెరికా విదేశాంగ కార్యాలయంనుంచి బుల్లిట్ అనే ఉద్యోగి అతనితో మంతనాలు జరిపాడు. బావోడాయ్ తిరిగి చక్రవర్తి కాగోరినట్లయితే అమెరికా సహాయపడగలదని చెప్పాడట. అమెరికా ఒత్తిడిపైనే తిరిగి ఫ్రెంచి అధికారులు బావోడాయ్‌తో సంప్రదింపులు జరిపినట్లు ఫ్రెంచి ప్రెస్ ఏజన్సీ వార్త ప్రచురించింది.

బావోడాయ్‌ని తిరిగి చక్రవర్తిగా చేస్తే కొచిన్ చీనాను హోచిమిన్ రిపబ్లిక్‌పై రెచ్చగొట్టవచ్చుని ఇప్పుడు ఫ్రెంచివారి ఆశ.

## బావోడాయ్:

బావోడాయ్ వయస్సు ఇప్పుడు 36 సంవత్సరాలు. చరిత్రప్రసిద్ధి కెక్కిన అనాంచక్రవర్తి గియాంలాంగ్ మనుమనికి మనుమడు. ఫ్రెంచి దేశంపట్ల భక్తి అనురాగాలుగల చక్రవర్తి. అనాంలో పరిపాలించిన గాని దేశం ఎప్పుడూ ఫ్రెంచివారికి లొంగిఉండదని ఫ్రెంచిపాలకులు గ్రహించారు. బావోడాయ్‌ని, అతని ఏడవ ఏటనే పారిస్ తీసుకుపోయారు. పదిసంవత్సరాలు ప్రత్యేక అధ్యాపకులచే ఇతనికి విద్యాబుద్ధులు, రాజకీయాలు బోధించారు. పారిస్ భోగవిలాసా లన్నిటికీ అలవాటు గరిపారు.

1935 లో అతని తండ్రి చనిపోగానే బావోడాయ్ స్వదేశం వచ్చాడు. ప్రధాననగరమైన హ్యూను ఆధునిక విధానాలలో సంస్కరించాడు. రాజాంతఃపురాన్ని పారిస్‌లోని ఒక ఆధునిక భవనంగా మార్చివేశాడు. మంత్రుల్ని మార్చివేశాడు. "భూతలస్వర్గం" అనే పేరుగల రాజభవనంలో అను కోరదగినవెల్ల సమకూర్చబడినయ్. దేశమంతటా పాఠశాలల్లో ఫ్రెంచి భాష నిర్బంధంగా బోధించాలని ఉత్తరువు చేశాడు. సైన్యవిద్యాభ్యాసానికి ఏర్పాట్లు చేశాడు. ఫ్రెంచి సలహాదార్లు అనేకమందిని నియమించాడు. తల్లి, మంత్రులు చెప్పిన కన్యను వివాహంచేసుకోకుండా నిరాకరించాడు. పారిస్‌లో ఉండగా తాను స్నేహం చేసిన మేరియన్ అనే ఒక కాథలిక్ కన్యను స్వదేశం రప్పించి వివాహం చేసుకున్నాడు. పాశ్చాత్యరీతిని దుస్తులు ధరించే మేరియన్ మహారాణి అయింది.

1940లో జపాన్‌వారు దేశాన్ని ఆక్రమించుకున్నప్పుడు ప్రజల యోగక్షేమాల గురించిన చింత అతనికి పీసమైనా లేకపోయింది. దేశాన్ని ఒప్పగించి ఊరుకున్నాడు. తన పేరనే ఫ్రెంచివారు, ఆ తరువాత జపాన్ సేనలు దేశాన్ని పరిపాలిస్తుండగా తన దౌర్బల్యస్థితిని అప్పుడు గ్రహించలేకపోయాడు. వియత్ మిన్ జాతీయోద్యమం బావోడాయ్‌లో కూడా మొదట కొన్ని ఆశలు పురికొల్పింది. దేశానికి దాస్యంనుంచి ముక్తి నిచ్చి, సర్వ స్వతంత్రుడై పరిపాలించవలెననే వాంఛ అతనికి కలిగింది. కాని వియత్‌మిన్‌పక్షంలో కమ్యూనిస్టులున్నారనే భయం అతన్ని జాతీయోద్యమంలో చేరనివ్వలేదు. చివరికి సింహాసనం త్యజించి హాంకాంగ్‌లో తల దాచుకున్నాడు.

ఫ్రాన్సు తిరిగి అతన్ని చక్రవర్తిని చెయ్యాలని ప్రయత్నించినప్పుడు మొదట కొంత సంకోచించినా చివర కిప్పుడు అంగీకరించాడు. 1948 జూన్‌లో టాంకింగ్‌లో ఒక ఫ్రెంచి యుద్ధనౌకనుంచి దిగాడు. అతనితో ఫ్రెంచి హైకమీషనరు బోలర్ట్, కొచిన్ చీనా ప్రభుత్వ ప్రధాని జనరల్ జువాన్ ఉన్నాడు. తిరిగి బావోడాయ్ చక్రవర్తి కావడానికి అంగీకరించాడు. ఫ్రెంచివారు అతన్ని చక్రవర్తిని చెయ్యడానికి అంగీకరించారు. కొచిన్ చీనాలో ఫ్రెంచి పరిపాలకుల ఆధిపత్యం క్రిందనే ఎన్నికలు జరిపారు. జనరల్ జువాన్ పక్షమే ప్రభుత్వానికి వచ్చింది. గతమాసంలో ఈ శాసనసభ బావోడాయ్ చక్రవర్తిత్వాన్ని అంగీకరించింది. బావోడాయ్ ఈ మాసంలో ఇండొచీనాలోని తన పూర్వ రాజభవనంలో చేరనున్నాడు. అతని సింహాసనారోహణకి ఫ్రెంచి పాలకులు పెద్ద ఆడంబరంతో సన్నాహాలు చేస్తున్నారు.

కానీ ఎన్నటికీ బావోడాయ్ చక్రవర్తిత్వాన్నిగాని ఫ్రెంచి సైన్య పరిపాలనను గాని ప్రజలు అంగీకరించజాలరనీ, తుదివరకూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడగలరనీ హోచిమిన్ ప్రకటించాడు. ఫ్రెంచివారు తమ సైన్యాల్ని బలపరుచుకుంటున్నారు. త్వరలో తిరిగి అక్కడ అంతర్యుద్ధం ప్రారంభం కావచ్చును. తనకు చీనా కమ్యూనిస్టుల సహాయం లభించగలదని హోచిమిన్ ప్రకటించాడు కూడా.

---

# సైకిలు సవారీ

(11వ పేజీ తరువాయి)

మా?అని ఆలోచించగా పోట్లాడడానికే నిశ్చయించుకొన్నాము. ఈ ఇనుపగుఱ్ఱం, మీదుమిక్కిలి లాలాసాహబుగారి "ఎక్కడికి" ప్రభావం. ఈ రెండింటిదగ్గర నే నేమాత్రం? నేనే కాదు. పెద్దవీరయోధులు కూడా నిలపడలేరు. సయికులు నిలపెట్టి, నేను యుద్ధవీరుడిలాగ నిలపడ్డాను. వెంటనే సైకులు జోరుగా నా కాళ్లమీద తిరుగబడింది. "అయ్యోయ్, నాయనోయ్" అనుకొంటూ రామ - దుహాయి బజారులో గంతడ మారంభించేను. మాష్టరుగారు "లస్సీ" విడచి పరిగెత్తి వచ్చేరు. చుట్టుప్రక్కల ఉన్నవారుకూడా వెంటనే చుట్టూ మూగేరు. సైకులు ఒక ప్రక్క, నేనొక ప్రక్క పడి ఉన్నాము. సైకుల్ని ఒకరు నన్నొకరు ఎత్తి తీసేరు. మరికొందరు "దెబ్బలేమైనా తగిలేయా?" అన్నారు. "కొంచెం రెండడుగులు వెయ్యండి. రక్తం సర్దుకొంటుం"దని మరికొంద రన్నారు.

నాకు సిగ్గు లేజ్జా పోయింది. నా శరీరం బరువంతా ఒక పాదాలమీదనే ఆనిఉంచడమువలన కాళ్లు వణికిపోయేయి. మాష్టరుగారు సైకులు బాగా చూసి "ఇది విరిగిపోయింది. బాగు చేయించాలి" అన్నాడు.

ఇదియంతా లాలాసాహెబుగారి "ఎక్కడికి" ప్రభావమే అని మొదటే తెలుసుకొనినాను. సైకులు బాగుచేయించుటకు మిస్త్రీ సాహెబుగారి దుకాణమునకు పంపించేను.

కాని నా వీరహృదయాని కున్న ధైర్యము, సాహసము చూడండి. ఇప్పుడుకూడ యిట్టి క్షేత్రములో నిలబడియున్నాము. ఎనిమిది, తొమ్మిది రోజులలో సైకులు నేర్చుకొన్నాము. కాని అప్పటికి సైకులుమీద ఎక్కుట రాలేదు. ఎవరైన మీలాంటి ఉపకారబుద్ధిగలవారు నన్ను సైకులుపై కూర్చోబెట్టిన ఎంతదూరమైనా వెళ్లిపోతాను. నా ఆనందానికి అప్పుడు అంతు కనబడుటలేదు. ఈ విద్యలో నేను రెండు, మూడు రోజులలో పండితుడనైపోతాను. తరువాత *Professor* నైపోతాను. ఆతరువాత *Principal* నైపోతాను. ఒక *training school* పెడతాను. నెలకు 3, 4 వందలు ఆర్జిస్తాను. తివారీగారు చూసి ఆశ్చర్యపడుతారు. ఈర్ష్య పడతారు.

ఆవేళ మాష్టరుగారు నన్ను సైకులుపై నెక్కించి రోడ్డుమీద విడిచిపెట్టేరు. ఇంక వెళ్లండి సైకులు వచ్చింది అని అన్నారు. సైకులు రోడ్డుమీద నడుస్తున్నాది. మనస్సు ఎక్కువ సంతోషముతో ఊయల ఊగుతున్నాది. ఆ సంతోషములో సింహగడము జయించిన ట్లున్నది. అప్పటి స్థితి ఎలాగున్నదో కొంచెము తిలకించండి. ఎవడైనా మనుష్యుడు రెండువందల గజాల దూరములో వున్నప్పటికీ గట్టిగా గొంతుక పెట్టి "ఏమండోయ్, కొంచెము ఎడమప్రక్కకి వెళతారా! సైకులు క్రొత్తగా నేర్చుకొంటున్నాను. సైకులు మా వశములో లేదు" అని కేక పెట్టేవాడిని. కొంచెము దూరములో ఏదైన బండి కనిపించిందా, మా ప్రాణాలు ఎండిపోతాయి. ఆ సమయములో నా హృదయము ఏ పరిస్థితిలో ఉందో ఆ పరమేశ్వరునికే తెలుసు. బండి దాటిపోయిందంటే నా ప్రాణము కుదుటపడుతుంది. వేగంగా తివారీగారు వస్తున్నారు. నేను వారిని దూరమునుంచి చూసి "ఓ తివారీగారు, కొంచెము ఎడమప్రక్కకు వెళ్లండి. లేకపోతే సైకిలు మీ పైకి ఎక్కిస్తానేమో భయంగా ఉంది. తివారీగారు చిన్నకళ్లతో మా ప్రక్కజూచి చిరునవ్వుతో" అన్నారు.

"కొంచె మొక మాట విని వెళ్లండి నే నొక మాటు హేండిల్ ప్రక్క చూచి తిరిగి తివారీ ప్రక్కచూచి—

నేను · ఈ పరిస్థితులలో ఏమాటని వినగలమో తమరు చూడలేదూ? సైకులు త్రొక్కుతున్నాం. ఇది చూసీకూడా మాటవిని వెళ్లమంటున్నారా?

తివా సైకులు తొక్కుతున్నావా తమ్ముడూ . సైకులు....అయితే ఎవరైన సైకులు త్రొక్కితే పై వాళ్ల మాట వినరూ? చాలా ఆవశ్యకమైన మాటకొంచెం విని వెళ్లండి.

నేను సైకులు కొంచెం జాగ్రతగా ఆపుకుంటూ ఇలాగ అన్నాను: "సైకులు దిగి మీ మాట వినడానికి వస్తే మళ్లా సైకు లెవ రెక్కిస్తారు?" అని వెళ్లిపోయేను. తివారీగారు కేకలు వేస్తూ వెనకకి ఉండిపోయేరు. ఇంతలో ఒక టాంగా వస్తున్నట్లు కనపడింది. దూరంనుండే దాన్ని చూసి కేకలువేయడం ప్రారంభించేము. "ఎడమప్రక్కన తోలు తమ్ముడూ, సైకిలు క్రొత్తగా నేర్చుకొంటున్నాను."

టాంగా ఎడమప్రక్క వెళ్లిపోయింది. నేను గండం తప్పించుకొని త్రోవలోనుండి జాగ్రతగా వెళుతున్నాను. నా దుర్దశవలన టాంగా మళ్లా ఎదురుగుండా వచ్చింది. కొంచెం హేండిలు ప్రక్కకి తిప్పితే ప్రక్కకు పోయి ఉందును గాని, చెడుసమయం వస్తే మొదట బుద్ధి పాడైపోతుంది. ఆ సమయంలో హేండిలు ప్రక్కకి తిప్పాలన్న సంగతి మరచిపోయేను. ఆ సమయంలో విధాత టాంగా వస్తున్న త్రోవనే సైకులు తీసికొనివెళ్లమని వ్రాసినాడు గాబోలు.

ఒక్క క్షణంలో నా జీవితంలో అన్ని సంఘటనలు జ్ఞాపకానికి వచ్చేయి. రెండో క్షణంలో నేనూ, నా సైకిలూ టాంగాక్రింద ఉన్నాం. తెలివివచ్చి చూస్తే నా యింటిలో ప్రక్కమీద నున్నాను. నా శరీరంమీద ఎన్నో పట్టీలు కట్టబడి ఉన్నాయి.

అప్పటినుండీ ఇప్పటివరకు సైకులు చేతితో ముట్టుకోడంటే నమ్మండి!

---

# "రోమ్మెల్"ను నాజీలే చంపారు

(7 వ పేజీ తరువాయి)

బహటానికే రోమ్మెల్ ప్రయత్నిస్తే, రోమ్మెల్ కుటుంబం కూడా చాలా కష్టాలకు గురికావలసి వస్తుందనీ, గప్‌చిప్‌గా విషం పుచ్చుకొంటే, ఇతరుల కెవ్వరికీ ఏ ఆపదా రాదనీ, కుటుంబానికి గౌరవా లన్నీ అట్టే మిగులుతాయనీ, ఆ వచ్చిన జనరల్స్ ఇద్దరూ రోమెల్‌కు విశదీకరించారు. "తమ సేనానాయకులలో తమ కందరకూ ఆప్తప్రాయుడైన వాడు కూడా, తమ ఫ్యూహరర్ పై కుట్ర పన్నాడని ప్రజలకు తెలుపటం, రోమ్మెల్ కీర్తికి కళంకం తేవటం తన కిష్టం లేదని "హిట్లరు అభిప్రాయ మని వాళ్లు చెప్పారు.

రోమ్మెల్ వాళ్లతో కారులో బయలుదేరినాడు. కారులో విషపాత్ర అందిచ్చారు. మూడు సెకనులలో విషం పనిచేసింది. జులై 17 న తగిలిన గాయాలవల్ల తీసుకొని రోమ్మెల్ చనిపోయాడని, మరుక్షణంలో ప్రపంచానికంతకూ వార్తలు వెళ్లాయి. రోమ్మెల్ అంత్యక్రియలు మిలిటరీవైభవంతో జరిగాయి. కాని హిట్లరు రాలేదు. రుండ్‌స్టెడును పంపాడు. హత్యానాటకంలో తుది అంకం కూడా, నిశ్శబ్దంగానే పూర్తి అయిపోయింది.

(రీడర్స్ డైజస్టు(డిసెంబరు)వ్యాసం ఆధారం.)

గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వర ఫార్మసీ, రాజమండ్రి.

ఉత్తమ శైవమత గ్రంథము
పండితారాధ్య చరిత్ర
పాల్కురికి సోమనాథకవి రచించిన ఉత్తమ ద్విపదకావ్యము. డా. చిలుకూరి నారాయణ రావుగారిచే పరిష్కరింపబడినది. దీక్ష, పురాతన, వాద మహిమ, పర్వతములను అయిదు ప్రకరణములను ఒకే సంపుటమున గలవు. ఇంత నిర్దుష్టముగ ఈ గ్రంథము ఇదివర కెవ్వరును ప్రచురించి యుండలేదు. నారాయణరావుగారు రచించిన అమూల్యమైన పీఠికకూడ కలదు. వెల రు. 5/- (ప్యాకింగు, పోస్టేజి రు. 1-5-0)
ఆంధ్రగ్రంథమాల పో. బా. 212, మద్రాసు.